ముంగిళ్లలో రంగవల్లులు

- ధనుర్మాసంలో ముగ్గులకు ప్రాధాన్యం
- రంగవల్లులు వేసేందుకు పోటీ పడుతున్న మగువలు



బత్తలపల్లిలో అందంగా వేసిన ముగ్గు

బత్తలపల్లి: ధనుర్మాసంలో ముగ్గులు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. నెల పొడవున ప్రారంభమై భోగి రోజుతో ముగ్గులు పెట్టడం ముగియనుంది. పెళ్లీడు అమ్మాయిలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లతో పూజలు చేయడం ద్వారా మంచి వరుడు వస్తాడని అండాళ్ తల్లి పావన చరిత ద్వారా తెలుస్తుంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతికి పూర్ణ కుంభం, కనుమకు రథం ముగ్గు వేయడం ఆనవాయితీగా వస్తోంది.

ముగ్గుల్లో మెలకువలెన్నో..

చేతి వేళ్ల మధ్యలోంచి ముగ్గును జార విడుచుతూ వేసే పద్ధతి సాధారణమైనది. అయితే ఆధునిక కాలంలో అనేక నూతన పద్ధతులు ఉనికిలోకి వచ్చాయి. ముగ్గు, రంగు రంగు పౌడర్లు, పెయింట్లు, బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గులు, అచ్చు, మెట్లుపై స్టిక్కర్లు, ఆరు తిక్, మరో ఆరు లైట్ మొత్తం 12 రకాల రంగులు కొనుగోలు చేస్తున్నారు. తమ ముగ్గులను చుక్కలు, మెలికలు, డిజైన్స్, హాస్యం బొమ్మలు, కూరగాయలు, దేవతామూర్తులు, సంగీత సాధనాలతో నింపుతున్నారు. భోగి రోజున రథం బొమ్మ వేయడం సాధారణంగా జరుగుతుంది.

ఆకట్టుకుంటున్న ముగ్గుల పోటీలు..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం పలు సంఘాలు, సంస్థలు చేస్తుంటాయి. మహిళలు పోటీల్లో పాల్గొనడం గ్రామాల్లో విశేషంగా కనిపిస్తుంది. ఇంటి రహదారి మట్టిదైతే ముగ్గు, పౌడర్‌లతోనూ, సీసీ రోడ్డు అయితే పెయింట్, బ్రష్‌లతోనూ ముగ్గులు వేస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారాల వద్ద సంక్రాంతి శుభాకాంక్షలు, స్వాగతం చెబుతూ రంగు రంగుల ముగ్గులు వేస్తున్నారు. మెట్లు, హాలులో రకరకాల డిజైన్ల ముగ్గులు ఉన్న స్టిక్కర్లను అతికిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లోని నోటు పుస్తకాలను కూడా ముగ్గులతో నింపేస్తున్నారంటే వాటిపై మహిళల కున్న ఆసక్తి ఎంతో అర్థం చేసుకోవచ్చు.

శాస్త్రీయ అంశాలేన్నో..

ముగ్గులు వేసే ప్రక్రియలో శాస్త్రీయ అంశాలు ఉన్నాయి. వ్యాయామం ద్వారా అదనపు ఆరోగ్యం సిద్ధిస్తుంది. పరిసరాల పరిశుభ్రం కావడం, అందంగా తీర్చిదిద్దడం, మానవుని కళాదృష్టి కళా పోషణకు తార్కాణంగా ముగ్గులు నిలుస్తాయి. చుక్కల ముగ్గులు ద్రవిడ సంప్రదాయంగానూ, గీతల ముగ్గు ఆర్య సంప్రదాయంగానూ చూస్తారు. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా పురుగు పుట్రలకు ఆహారం వేయడమే భావన కూడా ఉంది. ముగ్గు వేయడంలో సంస్కృతి, సైన్స్ రెండూ ఉన్నాయన్నమాట.

జ్ఞాన సముపార్జన..

విజ్ఞానం అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లో ముగ్గుల ద్వారా జ్ఞానాన్ని అందించారన్న వాదన ఉంది. కొమ్మా, రెమ్మా, పక్షులు, మృగాలు, పురాణగాథల ఘట్టాలను ముగ్గుల్లో వేసి అవగాహన పెంచేవారు. అయితే మంచు ప్రభావం కూడా ముగ్గుల్లో కనబడుతోంది. రంగులతో వేసిన ముగ్గులు మరో రంగులోకి మారుతూ కనువిందు చేస్తూ మహిళలను ప్రోత్సహించడం ప్రకృతి సిద్ధమైన పరిణామం.

ఖర్చుకు సైతం సై..

పాతకాలంలో ముగ్గు అంటే తెలుపు రంగే అన్నట్లు ఉండేది. ఇప్పుడు పౌడర్ల రూపంలో ఉన్న అనేక రంగులు ఉనికిలోకి వచ్చాయి. 50 గ్రాములు రంగును రూ.10 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో అందుబాట్లో ఉన్న ముగ్గుల పుస్తకాలు కొనుగోలు, నెట్ పాయింట్లకు వెళ్లి డిజైన్లను డౌన్‌లోడ్, మొబైల్ ఫోన్ల ద్వారా డౌన్‌లోడ్ చేసేందుకు రీచార్జీలు, న్యూస్ పేపర్లు కొనుగోలు నిమిత్తం ఖర్చు చేసేందుకు సైతం వెనకాడని పరిస్థితి ఉంది.

పేపర్లలో చూసి ముగ్గులు వేస్తున్నా..



ధనుర్మాసం కావడంతో న్యూస్ పేపర్లలో రకరకాల ముగ్గులు ప్రచురిస్తున్నారు. వాటిని ఆధారంగా చేసుకుని ముగ్గులను ప్రాక్టీస్ చేస్తున్నాం. పండుగ రోజు ఇంటి ముంగిట వేసే ముగ్గుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సంక్రాంతి పండుగ రోజు ముగ్గులు వేసేందుకు పోటీ పడుతాం. ఇది చాలా సంతోషంగా ఉంటుంది.

– ప్రియాంక, గృహిణి, బత్తలపల్లి

సంస్కృతికి ప్రతీక



ముగ్గులు సంస్కృతికి ప్రతీకలు. సంస్కృతిలో భాగమవ్వడంలో ఆడవాళ్లు ఎప్పుడూ ముందుంటారు. అందుకే ముగ్గులు వేసేందుకు ఎంతో ఆసక్తి చూపుతాము. ఏడాదిలో సంక్రాంతి పండుగ నాటి ముగ్గుకే ప్రాధాన్యత ఇస్తాం. మా ఇంటి ముందు ముగ్గు ఏది వేయాలో, ఎలా వేయాలో అని ఆత్రుతగా ఉంటుంది.

– అరుణాదేవి, గృహిణి, బత్తలపల్లి

ప్లాట్లు కోల్పోయాం.. న్యాయం చేయాలి



న్యాయం చేయాలని పత్రాలు చూపుతున్న బాధితులు

కదిరి టౌన్: 'కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద అప్రూవ్ లేఅవుట్ ప్లాట్లు కోల్పోయాం. అధికారులు స్పందించి న్యాయం చేయాలి' అని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కదిరి ఆర్అండ్‌బీబంగ్లాలో ఆదివారం వారు విలేకరు సమావేశంలో మాట్లాడారు. గత ఆర్డీఓ వంశీకృష్ణ అప్రూవ్ లేఅవుట్‌లో ప్లాట్లు కోల్పోయిన వారికి సెంటుకు రూ.3 లక్షల మేరు నష్టపరిహారం అందజేస్తామన్నారు. కానీ మేము ఎవ్వరు ఒప్పుకోలేదన్నారు. రైల్వే బ్రిడ్జికి సంబంధించి మార్కింగ్ ఇచ్చి ఏడు సంవత్సరాలుగా కాలయాపన చేస్తున్నారన్నారు. సర్వే నెంబర్ 394–ఎ, 397 లో దాదాపు 4 ఎకరాల్లో 123 మంది అప్రూవ్ ప్లాట్లు కోల్పోతున్నామని, ప్రస్తుత ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మకి విషయం వివరించామన్నారు. అయితే ఇటీవల సెంటుకు కేవలం రూ.57 వేలు పరిహారం ఇస్తామని రైల్వే బ్రిడ్జి కంట్రాక్టర్ తెలిపారన్నారు. ఈ విషయంపై గతంలో ఉన్న ఆర్డీఓకు, కలెక్టర్‌కు స్పందనలో కూడా ఆర్జీ ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు విషయం చెప్పితే మీకు న్యాయం చేస్తామన్నారని. అయితే ఇంతవరకూ ఎలాంటి స్పందన కనిపించలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మోహన్, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, అనంతరెడ్డి, నాగభూషణం, అజుముల్, అస్లామ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సేవలు ఆదర్శం



తలుపుల: వివేకానంద విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



తాడిమర్రి: స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: నేటి యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని హిందూపురం, బుక్కపట్నం డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు రంగనాయకులు, ఓబిలేసు తెలిపారు. ఆదివారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో యువజనోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఉన్న వివేకనందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న వయస్సులోనే వివేకానందుడు తన ఉత్తమ ప్రసంగాల ద్వారా ప్రపంచ ఆధ్యాత్మిక వక్తగా కీర్తింప పడ్డాడని కొనియాడారు. ఉపాధ్యాయులు గోపి, సురేష్, నగరాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: పట్టణంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో ఆదివారం స్వామి వివేకానందుడి జయంతిని బీసీ మహాజన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ మహజన సమితి నాయకులు హరిప్రసాద్, మునికుమార్,శివకుమార్,ప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతి వేడుకలను కదిరి పట్టణంలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పిట్ల రామకృష్ణ, నాయకులు తలుపుల గంగాధర్, శరత్‌కుమార్‌రెడ్డి, అశోక్‌బాబు, ఇంతియాజ్, చలపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం స్ఫూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయనపల్లి గ్రామానికి చెందిన మహబూబ్ బాషా అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించారు. రెండు 25 కిలోల బియ్యం ప్యాకెట్లు, రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీసాని గణేష్, బీసాని నాగరాజు, గూండా పుల్లయ్య, దిమ్మగుడి షబ్బీర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆదివారం ఆయన చిత్ర పటాన్ని ఉంచి పూల మాలలు వేసి ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఉపాధ్యాయుడు గంగిశెట్టి, రాజశేఖర్, రహంతుల్లా, మహబూబ్‌పీరా, హమాలీ, ఆటో యూనియన్లు పాల్గొన్నారు.

సంక్రాంతికి సిద్ధం..



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మూడు రోజులపాటు సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు ప్రజలంతా ఉత్సాహం చూపుతున్నారు. ధర్మవరం పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి పండుగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేశారు. ఇంటి ముందు కొట్టడానికి మార్కెట్‌లో విక్రయిస్తున్న గుమ్మడి కాయల కోసం ప్రజలు పోటీపడ్డారు. భోగి, కనుమ, సంక్రాంతి అంటూ మూడు రోజులపాటు పండుగ జరుపుకునేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. పట్టణంలో రంగులు అమ్మేవారు, పూలు, టెంకాయలు, వ్యాపార దుకాణాలు, గుమ్మడికాయల దుకాణాలు ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి.

– ధర్మవరం అర్బన్:

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి



ఉషశ్రీ చరణ్‌కు సత్యసాయి చిత్రపటం అందజేసిన ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌తో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉషశ్రీచరణ్‌ను జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమాడ మండలం గోపేపల్లికి చెందిన దాదిరెడ్డి గంగిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిందని నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఉషశ్రీచరణ్ సూచించారు. మాజీ మంత్రిని కలసిన వారిలో వెంకటశివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ముక్తాపురం ఆదినారాయణరెడ్డి, రామాంజనేయులు, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి

ఎన్పీకుంట: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ వెలిచలమల అంజన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లా కార్యవర్గ కమిటీలో స్థానం కల్పించినందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, కదిరి సమన్వయకర్త బీ.ఎస్.మక్బూల్‌అహ్మద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

తలుపుల: మండలంలోని గెరికపల్లికి చెందిన బి.చెన్న క్రిష్టారెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ సెకరెట్రీగా ఎంపిక చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనను ఎంపిక చేసినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు., మరింత బాధ్యతగా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, కదిరి సమన్వయకర్త బి.ఎస్ మక్బూల్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కృతజ్ఞతలు

బత్తలపల్లి: పెనుకొండ పట్టణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా స్థాయి కార్యవర్గంలో చోటు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరంలో మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బిల్లే సూరి, మందల నారాయణ, సాకే సురేష్, బిల్లే శంకర్, కమతం శంకరయ్య, కమతం నారాయణస్వామి, సాకే కిరణ్, గవ్వల రమేష్, లోకేష్, బిల్లే శివ, నరేష్, ముసుగు అప్పస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆశీస్సులు గొప్పవి



కొబ్బరి కాయలు కొడుతున్న పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

రామగిరి: ముత్యాలమ్మ ఆశీస్సులు గొప్పవని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విదేశీ పర్యటనకు అనుమతి లభిస్తే ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తానని గతంలో మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కోర్టు ద్వారా విదేశీ పర్యటనకు అనుమతులు లభించడంతో నాయకులతో కలసి ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేయించామన్నారు. 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహానందరెడ్డి, ధనుంజయ యాదవ్, బోయ రాజారాం, కురుబ ముత్యాలప్ప, బెడుదూరు గోపాలరెడ్డి, సీకె.పల్లి జెడ్పీటీసీ మెట్టు గోవిందరెడ్డి, సర్పంచులు గంగాధర్ రెడ్డి, ఓబిరెడ్డి, పూలకుంట శివారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు కుంటిమద్ది రమేష్, కేసీ.మనీష్, సత్యనారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి గౌడ్, రామకృష్ణ, సోమశేఖర్ రెడ్డి, పోలేపల్లి సూరి, రమేష్ రెడ్డి, రవి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి గాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి–ధర్మవరం రహదారిలో గొట్లూరు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని వడ్డెర కాలనీకి చెందిన వడ్డె ప్రసాద్ ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనిపై ధర్మవరం వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. గొట్లూరు సమీపంలోకి రాగానే పెట్రోల్ బంకులో నుంచి ఆటో ఎదురుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైంది. స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి..

నల్లచెరువు: మండలంలోని దేవిరెడ్డి పల్లి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన దేవంత్‌రెడ్డి ఆదివారం ద్విచక్ర వాహనంలో నల్లచెరువుకు బయలుదేరాడు. దేవిరెడ్డి పల్లి సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టు దిమ్మెను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

దళితులపై వివక్ష, దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

కదిరి టౌన్: దళితులపై కులవివక్ష దాడులు అరికట్టాలని, బలహీనంగా ఉన్న మనం బలోపేతం కావాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు అన్నారు. ఆదివారం సీపీఐ అనుబంధ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభ పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్ర, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్,రాష్ట్ర రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య తదితరులు హాజరై మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. పలు ప్రాంతాల్లో కులవివక్ష చూపుతూ దాడులు, హత్యాచారాలు చేసున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులందరూ సమష్టిగా హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు గురుదాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర చౌదరి, ఆటో యూనియన్ నాయకులు మధునాయక్ సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పటి గురువులు సూర్యనారాయణ, శ్రీనివాసులు, రమేష్, హరిప్రసాద్‌రెడ్డి, నరసింహులు, విశ్వనాథ్, రెడ్డెప్ప, వెంకటేష్, షామీర్‌ను సత్కరించారు. జ్ఞాపికలను అందించారు. అనంతరం పాఠశాలకు కంప్యూటర్ సిస్టం, ప్రింటర్ అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరినాథ్‌రెడ్డి, మహమ్మద్, ఖయ్యూంబాషా, రెడ్డిశేఖర్, రమేష్, బాబ్‌జాన్, ముబారక్, రెడ్డి, భీమ్లానాయక్, లత, రెడ్డి, పల్లవి, కవిత, శారద తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల అపహరణ

ముదిగుబ్బ: తన తోటలో పెంచుకుంటున్న 50 నాటుకోళ్లతో పాటు కంప్యూటర్ స్కేల్, సబ్‌మెర్సిబుల్ పంపు సెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ముదిగుబ్బకు చెందిన రైతు జి.పెద్దన్న ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. ఇటీవల డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కోళ్లు కొనుగోలు చేయడానికి పొలం వద్దకు వచ్చారు. రేటు కుదరకపోవడంతో వెళ్లిపోయారు. అయితే రాత్రికి వారే వచ్చి ఎత్తుకెళ్లి ఉంటారని రైతు జి.పెద్దన్న అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటమ్మ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న అహోబిల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. దాని స్థానంలో కొత్త దేవాలయాన్ని నిర్మించేందుకు పాత దేవాలయాన్ని కూల్చివేశారు. నూతన దేవాలయ నిర్మాణానికి ఆలయ కమిటీ వారు భక్తుల నుంచి విరాళాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం చెన్నేకొత్తపల్లికి చెందిన రామదాసు రూ.లక్ష, అరవప్ప భార్య వెంకటమ్మ రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నరసింహులు, పూజారి అంజనేయులు, వెంకటేష్, సుబ్బరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం ఉన్నత పాఠశాలలో 1981–82 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్యులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



శిల్పారామంలో భోగిమంట వేసిన దృశ్యం

పుట్టపర్తి రూరల్/ పుట్టపర్తిటౌన్: సంక్రాంతి పండుగను నేపథ్యంలో పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం భోగి మంటలు వేశారు. 13న ముగ్గుల పోటీలు, సాయంత్రం మంటలు, 14న సాయంత్రం 4 గంటల నుంచి జబర్దస్ కళాకారులచే కామెడీ ప్రదర్శన, 15న గణేష్ నృత్య అకాడమీ నాటకాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు ఏఓ రమేష్‌రెడ్డి తెలిపారు.

సరదాల సంక్రాంతి సాదాసీదాగానే..

పుట్టపర్తిటౌన్: అల్లుళ్ల రాక.. పిండి వంటల సువాసన, గంగిరెద్దులు..గొబ్బెమ్మ పాటలు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గజ్జెల చప్పుళ్ళు, చిన్నారుల గాలిపటాలతో సరదాగా సాగాల్సిన సంక్రాంతి సందడి ఈసారి సాదాసీదాగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం భోగి మంటలకు సిద్ధం చేశారు. ఇంటిల్లిపాది అందరూ తలంటు స్నానం చేసి భోగి మంటలు వేస్తారు. భోగి మంటల్లో పాత వస్తువులన్నీ వేస్తారు. చెడును వదించుకొని మంచికి శ్రీకారం చుడతారు. మంగళవారం సంక్రాంతి పండుగ. ప్రతి ఇంటి లోగిలి రంగవల్లులు, మధ్యలో గొబ్బెమ్మలు, గుమ్మడి కాయ, పూల అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బుధవారం కనుమ పండుగ చేసుకోనున్నారు.

19న గిరిజన, ఆదివాసీ సమ్మేళన సభ



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

నల్లమాడ: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 19న గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండలంలోని పెమనకుంటపల్లి తండాలో విడుదల చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యే సభకు గిరిజనులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బాలాజీనాయక్, ఆనంద్‌నాయక్, రమేష్‌నాయక్, నీలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ ప్రారంభం

కదిరి అర్బన్: మండలంలోని మొటుకుపల్లిలో ఉపాధి హామీ నిధులతో పాడిరైతు పురుషోత్తం నిర్మించిన గోకులం షెడ్‌ను ఆదివారం ఎంపీడీఓ పోలప్ప ప్రారంభించారు. షెడ్‌ను సద్వినియోగం చేసుకుని పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ హరూన్ రషీద్, ఈసీ శ్రీధర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, చంద్ర, గణేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని పాతబత్తలపల్లి, ఎద్దుల వాండ్లపల్లి గ్రామాల్లో పశువుల కోసం నిర్మించిన షెడ్లను ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గో సంరక్షణకు షెడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లచెరువు: మండల కేంద్రంలోని నల్లగుట్ట వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మనోహర్ (42) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథ నాయుడు ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు.

17 నుంచి కుంభాభిషేకం

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుంజేపల్లి సమీపంలో వెలసిన కన్యగలగొంది క్షేత్రంలో ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు ధ్వజ శిఖర కుంభాభిషేక ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చౌటిపల్లి వేణుగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220726, 9010593486